
సాక్షి నిర్మల్

ఆదివారం। 10। సెప్టెంబర్। 2023



వానలో తడిచి.. శిబిరంలో నిద్రించి..
డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు జిల్లా కేంద్రంలో దీక్ష కొనసాగిస్తున్నారు. శనివారం వానలో తడిచి దీక్ష శిబిరంలోనే బస చేసి నిరసన తెలిపారు. 10లో▸



భళా.. స'జీవ'కళ!
జిల్లా కేంద్రానికి చెందిన శ్రావణ్‌కుమార్ మట్టితో వివిధ ఆకృతుల్లో వినాయక ప్రతిమలు తయారు చేస్తూ అబ్బురపరుస్తున్నాడు. చిత్రలేఖనం, నృత్యంలోనూ రాణిస్తున్నాడు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 28.0 /24.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఘనంగా కాళోజీ జయంతి



నివాళులర్పిస్తున్న జిల్లాకు చెందిన కవులు

నిర్మల్‌ఖిల్లా: ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి జిల్లాకు చెందిన కవులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రజల భాష, యాసలో కవిత్వం రాసి అట్టడుగు వర్గాల్లో చైతన్యం నింపేందుకు కృషిచేసిన కాళోజీ సేవలను కొనియాడారు. ఆయన జయంతినే తెలంగాణ భాషాదినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కవులు డాక్టర్ దామెర రాములు, డాక్టర్ యూ కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, తుమ్మల దేవరావు, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, పోలీస్ భీమేశ్, అబ్బడి రాజేశ్వర్, నాగారావు తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న, తెలుగు ఉపాధ్యాయులు పోతన్న, నాగయ్య కూర్మే, గంగాధర్, చిన్నన్న, రాజేశ్వర్, సాయన్న, అంబటి నారాయణ, రజిత, గంగారాణి, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరంగా బైక్ ర్యాలీ

నిర్మల్‌టౌన్: నిజాం విముక్త స్వతంత్ర అమృత మహోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఆదివారం భారీ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూవాహిని నిర్మల్ శాఖ నాయకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు శివాజీచౌక్ నుంచి ర్యాలీ ప్రారంభమై కురన్నపేట్‌లోని అమరవీరుల స్తూపం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. స్తూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు వారు వివరించారు.

భైంసా ఏరియాస్పత్రిలో వైద్యసేవలు భేష్



ప్రీతమ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా ఏరియాస్పత్రి సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఆస్పత్రిలో ఆర్థో వైద్యుడు ప్రీతమ్ ఓ రోగికి క్లిష్టమైన మోకాలి చిప్ప శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తిచేయగా ఆయనను శనివారం ఎమ్మెల్యేతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేశారని తెలిపారు. ఈనెల 15వ తేదీన తొమ్మిది మెడికల్ కాలేజీలను సీఎం ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. భైంసా ఏరియాస్పత్రిలో త్వరలోనే డయాలసిస్ పేషెంట్లకు ఐదు బెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏఎంసీ వైస్ చైర్మన్ జీకే పటేల్, నాయకులు పీ కృష్ణ, తోట రాము, ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులున్నారు.

ఎల్లన్నకు రాష్ట్రస్థాయి అవార్డు



ఎల్లన్నను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కుంటాల: పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎల్లన్న లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. గుణాత్మక విద్య అందించడం, వినూత్న రీతిలో బోధించడం, గ్రామస్తులు, దాతల సహకారంతో పాఠశాలలో శతశాతం విద్యార్థుల నమోదు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎల్లన్నకు ఈ అవార్డు ప్రకటించారు. శనివారం నిజామాబాద్‌లోని కమ్మ సంఘం కార్యాలయంలో ఎల్లన్నను సన్మానించారు. నిజామాబాద్, నిర్మల్ జిల్లాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మి, పురుషోత్తంరెడ్డి, బాబారావు, శ్రీనివాస్ గుప్తా, నవీద్, శ్రీనివాస్, కృష్ణమోహన్, అమర్నాథ్‌రావు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులపై శ్రద్ధ చూపాలి

నిర్మల్ రూరల్: పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంజేపీ పాఠశాలల డీసీవో సంతోష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎంజేపీ బాలికల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థినులను సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాష, యాస గురించి వివరించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ మోహన్, సిబ్బంది అమృత, సౌమ్య, గాయత్రి, ఉపాధ్యాయులున్నారు.




ఓ క్షణం.. ఆలోచించు

క్షణికావేశం నిండు ప్రాణాన్ని బలిగొంటుంది. నువ్వొక్కడివే కాదు.. నీపై ఆధారపడిన జీవితాలను ఛిద్రం చేస్తుంది. సమస్యలెన్ని ఉన్నా.. క్షణం ఆలోచించి చూడు.. పరిష్కారం దొరుకుతుంది. భవిత బంగారమవుతుంది. రోజులో పగలు, రాత్రి ఎంత సహజమో.. జీవితంలో కష్టసుఖాలూ అంతే. సుఖమొచ్చినప్పుడు పొంగిపోవద్దు. కష్టమొచ్చినప్పుడు కుంగిపోవద్దు. ఈ రెండింటిని సానుకూల దృక్పథంతో సమానంగా భావించి ముందుకు సాగితే ఎంత పెద్ద సమస్యనైనా సులువుగా అధిగమించవచ్చు. ఇటీవల చిన్నచిన్న కారణాలకే కొందరు ఆత్మహత్యలకు ఒడిగడుతూ విలువైన జీవితానికి ముగింపు పలుకుతున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. కన్నవారికి, కట్టుకున్న వారికి దూరమవుతూ పుట్టెడు దుఃఖాన్ని మిగుల్చుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

నాలుగేళ్లలో జిల్లాల వారీగా నమోదైన ఆత్మహత్యలు

- వివరాలు 10లో▸



కారులో కలవరం..!



- నేతల మధ్య కుదరని సయోధ్య
- ముథోల్‌లో రెండువర్గాలుగా పార్టీ
- 'ఏఎంసీ' వేదికగా మాటలదాడులు
- ఖానాపూర్‌లో దూరమైన 'ఎమ్మెల్యే'
- జాన్సన్‌కు వ్యతిరేకంగా ప్రచారం
- ఎన్నికలవేళ ముదురుతున్న అసమ్మతి

నిర్మల్: మూడు మాసాల ముందే 'కారు' పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. ఎన్నికల వేళ అసమ్మతి ఉండకూడదు.. ఉన్నా.. సర్దుబాటు అవుతుందన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ముందస్తుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించింది. జాబితా విడుదల చేసి దాదాపు నెలవుతున్నా.. జిల్లాలో ఇంకా అసమ్మతిసెగలు వేడిపుట్టిస్తూనే ఉన్నాయి. ప్రధానంగా ముథోల్, ఖానాపూర్‌లో సొంతపార్టీ నాయకులే అసమ్మతిరాగం వినిపిస్తున్నారు. ఖానాపూర్‌లో అంతర్గతంగా సాగుతుండగా, ముథోల్‌లో ఇటీవల బహిరంగ ఆరోపణలు, హెచ్చరికలు చోటుచేసుకుంటున్నాయి. నిర్మల్‌లో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి అసమ్మతి లేకుండా సాఫీగా సాగుతోంది.

ముదురుతున్న ముథోల్..
ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ముథోల్ నియోజకవర్గంలో ఈసారి ఎన్నికలు వేడివేడిగానే సాగేలా కనిపిస్తోంది. టికెట్లు ఖరారు కాకముందూ పలువర్గాలు వెళ్లి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశాయి. ప్రస్తుత ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి టికెట్ ఇవ్వద్దంటూ పట్టుబట్టాయి. ఇందులో పలువురు జెడ్పీటీసీలు, సీనియర్ నాయకులున్నారు. అయినా అధిష్టానం విఠల్‌రెడ్డివైపు మొగ్గుచూపింది. ఈ పరిణామం తర్వాత ఎమ్మెల్యే వర్గం అసమ్మతినేతలను టార్గెట్ చేస్తూ విమర్శలు ఎక్కుపెడుతున్నట్లు తెలుస్తోంది. వారికి అసమ్మతి నేతలు కౌంటర్లు ఇస్తుండటంతో పార్టీలో పరిస్థితి ముదురుతోంది.

ఫ్లెక్సీలతో మళ్లీ లొల్లి..
ముథోల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారైన తర్వాత కొంత ప్రశాంతంగా ఉన్నట్లు కనిపించిన నియోజకవర్గంలో తాజాగా ఫ్లెక్సీల ఏర్పాటు మళ్లీ మాటల మంటలకు ఆజ్యంపోసింది. భైంసా మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యేలను కీర్తిస్తూ, అసమ్మతి నేతలను టార్గెట్ చేసినట్లుగా ఏఎంసీ మాజీ చైర్మన్ పిప్పెర కృష్ణ పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలే ఇందుకు కారణమయ్యాయి. ఈ ఫ్లెక్సీలు తనను ఉద్దేశించి పెట్టినవేనంటూ ప్రస్తుత ఏఎంసీ చైర్మన్, సీనియర్ నేత జాదవ్ రాజేశ్‌బాబు మండిపడ్డారు. ఈమేరకు శనివారం భైంసాలో ప్రెస్‌మీట్ పెట్టి తనను అవమానపర్చేలా ఫ్లెక్సీలను పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. విఠల్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నందునే తమపై ఇలా ప్రచారం చేస్తున్నట్లు మండిపడ్డారు. దీనిపై మాజీ చైర్మన్ పిప్పెర కృష్ణ కూడా ప్రెస్‌మీట్ పెట్టి.. తనకు ఎవరినీ కించపర్చాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఖానాపూర్ 'కారు'లో..
ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్‌నే పక్కనపెట్టి కొత్తగా వచ్చిన జాన్సన్‌నాయక్‌కు టికెట్ ఇచ్చిన ఖానాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికీ అసమ్మతి కొనసాగుతూనే ఉంది. టికెట్ కోల్పోయిన ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఆమె భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్‌లో చేరడంతో తను కూడా అదే పార్టీలో చేరనున్నట్లు చెబుతున్నారు. ఆమె వర్గంలో కొందరు జాన్సన్‌నాయక్‌కు దగ్గరైనా, మరికొందరు రేఖానాయక్‌తోనే కొనసాగుతున్నారు. ఇక టికెట్ ఆశించిన పూర్ణచందర్‌నాయక్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ తదితరులు సహకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికీ సోషల్‌మీడియాలో వీరి అనుచరులు జాన్సన్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెడుతూనే ఉన్నారు.

నిర్మలమే..
నిర్మల్ నియోజకవర్గంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రెండోసారి వరుసగా బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు. ఇక్కడ పార్టీలో ప్రస్తుతం ఎలాంటి అసమ్మతి కనిపించడం లేదు. ఇదివరకు అసమ్మతిరాగం వినిపించిన సీనియర్ నేత శ్రీహరిరావు, సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇద్దరూ కాంగ్రెస్‌లో చేరారు. కొంతకాలంగా మంత్రికి దూరంగా ఉన్న సీనియర్‌నేత, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న సత్యనారాయణగౌడ్ ప్రస్తుతం విదేశాలకు వెళ్లారు. ఇక అదేకోవలో కొనసాగుతున్న మరో సీనియర్‌నేత చిక్యాల హరీశ్‌రావు కూడా దూరంగా ఉంటూ వస్తున్నారు. తాజాగా ఆయన మంత్రితో కలిసి సొన్కల్ మండలం కోసం మంత్రి హరీశ్‌రావును కలవడం, త్వరలో సీఎంను కలిసే అవకాశం ఉండటంతో అసమ్మతి లేనట్లే అని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి.

కేటీఆర్ దృష్టి సారిస్తేనే..

త్వరలో జిల్లాకు రానున్న మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టి పెడితేనే జిల్లాలోని బీఆర్‌ఎస్ అసమ్మతి సద్దుమణుగుతుంది. ముథోల్, ఖానాపూర్‌లో ఇంకా కొనసాగుతున్న అసంతృప్తి ఇప్పటికే కేటీఆర్ దృష్టిలో ఉన్నా.. మొన్నటి వరకు విదేశీ పర్యటనలో ఉన్న ఆయన తాజాగా రాష్ట్రరాజకీయాల్లో బిజీగా ఉన్నట్లు చెబుతున్నారు. త్వరలోనే జిల్లాలోని అసమ్మతి సంగతీ చూస్తారని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేసేలా చేస్తారని పార్టీనేతలు ఆశిస్తున్నారు.

ఘనంగా టీటీడీ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న భక్తులు, విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో శనివారం టీటీడీ రథయాత్ర నిర్వహించారు. బోయవాడ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర దేవరకోట దేవస్థానం వరకు కొనసాగింది. మహిళలు మంగళహారతులతో రథానికి స్వాగతం పలికారు. ఓం నమో.. వేంకటేశాయ.. జైశ్రీమన్నారాయణ.. అంటూ భక్తులు దారి పొడవునా స్వామివారిని స్మరించుకున్నారు. సాయంత్రం వికాస్ తరంగిణి సౌజన్యంతో హనుమాన్ దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి కోటి హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ చాలీసా పుస్తకాలను భక్తులకు అందించారు. దేవరకోట దేవస్థానం ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఆలయ ధర్మకర్తలు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాసరలో భక్తుల రద్దీ



చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న పండితుడు

భైంసా: శ్రావణ శనివారం కావడంతో బాసరలో భక్తుల రద్దీ కనిపించింది. ముందుగా భక్తులు గోదావరినదిలో పుణ్య స్నానాలాచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాభ్యాస పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సిబ్బంది, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

'ఆత్మ'ను మరిచారు..!

- నిరాదరణకు గురవుతున్న సంస్థ
- ఐదేళ్లుగా విడుదలకాని నిధులు
- సలహాలు, సూచనలు అంతంతే..
- ఊసేలేని సదస్సులు, ప్రదర్శనలు
- పునరుద్ధరించాలంటున్న రైతులు



నిర్మల్‌చైన్‌గేట్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆత్మ (వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) పథకం క్రమంగా నిరాదరణకు గురవుతోంది. రైతులకు పంటల సాగు, నూతన దిగుబడి, ఆధునిక వంగడాలు, సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించడంలో 'ఆత్మ' అధికారులు కీలకపాత్ర పోషిస్తుంటారు. అయితే అవి ఎక్కడా మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేక నిరాదరణకు గురవుతోంది. ప్రస్తుతం జిల్లాలో ఈ పథకం ఉనికే లేకుండా పోయింది. ఇటు అధికారులు, అటు ఆత్మ ప్రతినిధులు కార్యక్రమాల జోలికే పోకపోవడంతో సదస్సులు, ప్రదర్శనలు, రైతు అవగాహన కార్యక్రమాలు, విహారయాత్రలు ఎక్కడికక్కడా నిలిచిపోయాయి. ప్రధానంగా వ్యవసాయ యాంత్రీకరణపై దీని ప్రభావం అధికంగా పడింది. పత్తి, కంది, పెసర, వరి, శనగ తదితర పంటల సాగుపై సలహాలు, సూచనలు కరువయ్యాయి.

అన్నదాతలకు అవగాహన శూన్యం
వ్యవసాయ రంగం అభివృద్ధి సాధించాలంటే రైతులు అధునాతన విజ్ఞానం కలిగి ఉండాలి. అందుకు ఆధునిక యంత్రాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలి. కానీ.. వ్యవసాయాధికారుల నిర్లక్ష్యంతో 'ఆత్మ' పథకం ఉందన్న విషయమే జిల్లాలోని రైతులకు తెలియకుండా పోతోంది. గ్రామగ్రామాన తిరిగి రైతులకు సాంకేతికతపై అనేక విషయాలు తెలియజేయాల్సిన అధికారులు ఎప్పుడో ఓసారి సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. జిల్లాలో వివిధ రకాల పంటలు సాగవుతున్నా రైతులకు సరైన సూచనలు, సలహాలు అందడం లేదు. వేతనాలు అందని కారణంగా ఇందులో పని చేసేవారు గతేడాది నుంచి నామమాత్రంగా సదస్సులు నిర్వహిస్తున్నారు.

నిధుల లేమితోనే..
పథకం ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించేది. దీంతో సంబంధిత అధికారులు పంటల సాగు కోసం రైతులకు సూచనలు, సలహాలు ఇస్తుండేవారు. ఇందుకోసం ప్రత్యేక సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి రైతుల వ్యవసాయ క్షేత్రాల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండేవారు. అయితే ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆత్మ పథకానికి నిధులు కేటాయించడం లేదు. దీంతో వ్యవసాయాధికారులు, సంబంధిత సిబ్బంది కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావడం లేదు. ఫలితంగా వరితోపాటు ఇతర మెట్ట పంటలు సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు కరువయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. మెట్ట పంటలను సాగు చేసే రైతులు తగ్గుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆత్మ పథకానికి నిధులు కేటాయించడంతోపాటు సిబ్బందిని నియమించి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే బాగుంటుందని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. అధికారుల సూచనలు, సలహాలతో జిల్లాలో పప్పు ధాన్యాల సాగు పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

2001లో పథకం ప్రారంభం

కేంద్ర ప్రభుత్వం 2001లో ఆత్మ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయగా.. ఇందులో కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయాధికారి కన్వీనర్‌గా ఉండేవారు. డివిజన్ స్థాయిలో సలహా కమిటీలు ఉండేవి. ఆత్మ పథకంలోని సిబ్బంది, అధికారులు వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి యంత్రాలతో ప్రదర్శన నిర్వహించి రైతులకు సాంకేతికతపై అవగాహన కల్పించేవారు. పశుసంవర్ధక శాఖ, ఉద్యానశాఖ, మత్స్యశాఖల్లో సాంకేతికంగా వచ్చే మార్పులను అధికారులు రైతులకు వివరించేవారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేసేది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులకు వేతనాలు చెల్లించి, సాగులో సలహాలు, సూచనలు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాలి. కొన్నేళ్లుగా సాగు, యంత్ర పరికరాలపై అవగాహన లేక వ్యవసాయంలో సరైన దిగుబడులు రాక నష్టపోతున్నాం. ప్రభుత్వం నిధులు కేటాయించి పథకం అమలయ్యేలా చూడాలి.
– సాయన్న, కుంటాల

కేసుల సత్వర పరిష్కారానికే లోక్‌అదాలత్



నిర్మల్‌టౌన్: కేసు పరిష్కార పత్రాన్ని కక్షిదారుకు ఇస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్

నిర్మల్‌టౌన్: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్, జిల్లా సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్, సివిల్ జడ్జి అజయ్‌కుమార్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. లోక్‌అదాలత్‌లో మూడు సివిల్ కేసులు, 104 ప్రీలిటిగేషన్ కేసులు, 10,342 క్రిమినల్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. బ్యాంకులకు సంబంధించిన బకాయిలు రూ.47,68,285 వసూలు చేసినట్లు పేర్కొన్నారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ పురుషోత్తం, న్యాయవాదులు, కక్షిదారులున్నారు.

భైంసాలో 9,255 కేసులు పరిష్కారం
భైంసాటౌన్: భైంసా పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో 9,255 కేసులు పరిష్కరించారు. అలాగే 14 బ్యాంక్ సంబంధ కేసులు పరిష్కరించి రూ.61,100 రికవరీ చేయించారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి దేవేంద్రబాబు తదితరులున్నారు.

ఖానాపూర్‌లో 1,144 కేసులు..
ఖానాపూర్: ఖానాపూర్ కోర్టులో నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌కు స్పందన వచ్చిందని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. జడ్జి జితిన్‌కుమార్ ఆధ్వర్యంలో 1,144 కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం



పల్లకి సేవలో భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని దేవరకోట దేవస్థానంలో శ్రావణమాస చివరి శనివారాన్ని పురస్కరించుకొని శ్రీవేంకటేశ్వరస్వామి, అలివేలు మంగ, పద్మావతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, భాజాభజంత్రీల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆర్ట్స్, కామర్స్‌లో అపార అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నిర్మల్: ఆర్ట్స్, కామర్స్ రంగాల్లోనూ విద్యార్థులకు అపార అవకాశాలున్నాయని చరిత్ర, కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు కటకం మురళి, సుధాకర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని వశిష్ట డిగ్రీ కళాశాలలో శనివారం బీఏ, బీకామ్ ఫస్టియర్ విద్యార్థుల స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీరు మాట్లాడుతూ.. విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా కెరీర్ ఎంచుకోవాలని సూచించారు. ఆర్ట్స్, కామర్స్ రంగాల్లోని అవకాశాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల సెక్రటరీ సరోత్తంరెడ్డి, ప్రిన్సిపాల్ అఖిలేశ్‌కుమార్ సింగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఏఆర్ఎం ప్రతినిధిగా శంభు

ఖానాపూర్: ఆదివాసీ అధికార్ రాష్ట్ర మంచ్ ఆలిండియా మహాసభలకు ప్రతినిధిగా మండలానికి చెందిన తొడసం శంభు ఎంపికయ్యారు. సెప్టెంబర్ 19 నుంచి 21వ తేదీ వరకు తమిళనాడులోని సేలం జిల్లాలో జరిగే మహాసభలకు తనను ప్రతినిధిగా ఎన్నుకోవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ మహాసభల్లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం పక్షాన ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు సభలో వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

వాగుదాటి వైద్యం అందించి..


కన్నాపూర్ వాగును దాటుతున్న వైద్యులు

సిరికొండ: మండలంలోని మారుమూల గ్రామమైన కన్నాపూర్, కన్నాపూర్‌తండా గ్రామాల్లో శనివారం పిట్టబొంగారం పీహెచ్‌సీ వైద్యులు వాగును దాటి వెళ్లి ఆ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి వైద్యులు ప్రతాప్‌నాయక్, హెల్త్ సూపర్‌వైజర్ జలందర్, గంగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆయిల్ ప్యాకెట్లు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలో శనివారం ఆయిల్ ప్యాకెట్ల బాక్స్‌లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. భుక్తాపూర్‌లోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్‌ఎన్‌కే షాపు ఎదుట 12 బాక్స్‌లతో కూడిన ఐషర్ వ్యాన్‌ను నిలిపి ఉంచారు. గమనించిన దుండగులు ఆ వాహనంలో నుంచి ఆయిల్ ప్యాకెట్ల బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.21వేల వరకు ఉంటుందని బాధితుడు నంద కిషోర్‌రెడ్డి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ప్రదీప్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్కా, పేకాట ఆడితే చర్యలు


అరెస్ట్ చూపుతున్న ఎస్సై సందీప్

భైంసాటౌన్: మట్కా, పేకాట ఆడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై సందీప్ అన్నారు. పట్టణంలో మట్కా ఆడుతున్న మహమ్మద్ సుల్తాన్, మహమ్మద్ మోబీన్‌ను శనివారం సాయంత్రం పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారి వద్ద నుంచి రూ.4950 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

న్యాయం చేయండి సారూ...


పోచుబాయి

కాగజ్‌నగర్‌రూరల్: తన పట్టా భూమిని పెద్దకుమారుడు తన అ ధీనంలో పెట్టుకుని వేధింపులకు గురిచేస్తున్నాడని ఓ వృద్ధురాలు కన్నీరుపెట్టుకుంటుంది. తనకు న్యాయం చేయాలని కాగజ్‌నగర్ మండలంలోని సీతానగర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు మౌల్కార్ పోచుబాయి శనివారం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల ప్రకారం... పోచుబాయి కి ముగ్గురు కుమారులు తులసీరాం, విశ్వనాథ్, గణపతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1999లో భర్త మల్లయ్య మృతిచెందగా, 40 ఎకరాల భూమిలో నుంచి ఐదు ఎకరాలు తల్లి పోషణకు కేటాయించి మిగతాది పంపకాలు చేసుకున్నా రు. అప్పటి నుంచి పోచుబాయి పెద్ద కుమారు డి వద్ద ఉంటుంది. తల్లి పేరుపైన ఉన్న భూ మిని పట్టా చేయించాలని పెద్ద కుమారుడు వే ధించడం మొదలుపెట్టాడు. పోచుబా యి కాగజ్‌నగర్‌లో ఉంటున్న చిన్న కుమార్తె ప్రమీల వద్దకు వెళ్లింది. తనకు ఎలాగైన న్యాయం చేయాలని వృద్ధురాలు వేడుకుంటుంది.

17న మోటార్ మెకానిక్ ఉద్యోగాలకు పరీక్ష

రెబ్బెన(ఆసిఫాబాద్)/మందమర్రిరూరల్: సింగరేణిలో ఖాళీగా ఉన్న మోటార్ మెకానిక్ ట్రైనీ ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 17వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ కె.బసవయ్య తెలిపారు. సంస్థలో ఖాళీగా ఉన్న మోటార్ మెకానిక్ ట్రైనీ క్యాటగిరీ–1 ఉద్యోగాల భర్తీ కోసం యాజమాన్యం 2017 నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు 17వ తేదీన కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30గంట ల వరకు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలి పారు. రాత పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను సింగరేణి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూ చించారు. హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవటంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్‌డెస్క్ ఫోన్ 08744 249992 నంబర్‌ను ఆఫీస్ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ఓ క్షణం ఆలోచించు



- చిన్నపాటి కారణాలకే మృత్యుఒడికి
- యమపాశంగా మారుతున్న క్షణికావేశం
- అనాథలవుతున్న పిల్లలు... కన్నవారికి పుత్రశోకం
- నేడు ఆత్మహత్యల నివారణ దినం



"ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న తాంసి మండలం పొలోది గ్రామానికి చెందిన అడెపు శృతి(17) మొహర్రం సెలవులకు ఇంటికి వచ్చింది. తనతో చనువుగా ఉంటున్న గ్రా మంలోని యువకుడి ఇంటికి వెళ్లిన విష యం తండ్రికి తెలిసి తనను మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంది."



"భీంపూర్ మండలంలోని అందర్‌బంద్ ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదివే అనురాగ్ (13) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చదువుకోవాల్సిన వయస్సులో బడి మానేసి ఇంటి వద్ద ఉండడంతో బుద్ధిగా బడికి వెళ్లి చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించారనే కారణంతో తన నూరేళ్ల జీవితానికి ముగింపు పలికి తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చాడు."



"జైనథ్ మండలం మేడిగూడ గ్రామానికి చెందిన డొరే రవీందర్ అనే కౌలు రైతు తనకున్న మూడెకరాలతో పాటు మరో 14ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంట సాగుచేశాడు. వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడం, పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కన్పించకపోవడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడం ఆయన భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డునపడ్డారు. భార్య స్వప్న కూలీ పనిచేస్తు పిల్లలను పోషించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



"బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన పాముల సంతోష్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆటోను ఫైనాన్స్‌పై తీసుకున్నాడు. గిరాకి ఆశించనంతగా రాకపోవడం, కుటుంబ పోషణ భారమవుతుందనే కారణంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతని భార్య, ఇద్దరు పిల్లలు ఆధారాన్ని కోల్పోయి దిక్కులేని వారిగా నానా అవస్థల నడుమ కాలం వెళ్ల దీయాల్సి వస్తోంది.

కైలాస్‌నగర్: పుట్టిన ప్రతి మనిషికి జీవితంలో ఎదో ఒక సమస్య ఎదురవుతూనే ఉంటుంది. సమస్య ఎంత పెద్దదైనప్పటికీ దానికి పరిష్కారం ఉంటుంది. అయితే ఆ సమస్యను స్వీకరించే తీరు, దాన్ని పరిష్కరించుకునే విధానమే కీలకం. తమకు ఎదురైన సమస్యను తెలుసుకుని దానిని అధిగమించే మార్గాలను వెతుకుంటే సమస్య కన్న పరిష్కార మార్గాలే ఎక్కువగా కన్పిస్తాయి. తమకున్న సమస్యనే పెద్దదిగా భావించి విచక్షణ కోల్పోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఎదురైన సమస్యతో బాధపడకుండా మన అనుకునేవారికి చెప్పుకుంటే సగం పరిష్కారం అప్పుడే లభిస్తోంది. పిల్లల భవిష్యత్తు ఏమిటని ఆలోచన చేయకుండా ఆత్మహత్యకు పాల్పడి పిల్లలను వీధి పాలు చేస్తున్నారు. పిల్లలు తెలిసి, తెలియని వయస్సులోనే ఆత్మహత్యకు ఒడిగట్టి తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగుల్చుతున్నారు.

మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు



మానసిక ఒత్తిడితోనే ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుంటాయి. డిప్రెస్సన్‌లో ఉన్న వ్యక్తి నడవడిలో మార్పు వస్తుంది. గమనించి వైద్యుల వద్ద చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తే వారిని ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడవచ్చు. మానసిక సంఘర్షణకు గురై, సహనం లేనటువంటి వారు క్షణికావేశాల్లో ఆత్మహత్యలకు పాలపడుతున్నారు. ఇలాంటి వారిని ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్ చేస్తే వారు ప్రాణాలు తీసుకోకుండా చూడవచ్చు.

– డాక్టర్ ఓంప్రకాశ్, రిమ్స్ మానసిక వైద్య నిపుణులు

బతికే మార్గం చూడాలి



చేతినిండా పనిదొరక్క, ఉపాధి అవకాశాలు లేక కుటుంబ భారాన్ని మోయలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. పంటలు సరిగ్గా పండక, గిట్టుబాటు ధరల్లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఆత్మహత్యలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం



ఆత్మహత్యలు చేసుకోకుండా ఎస్సైలు తమ పరిధిలో రెగ్యులర్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకోకుండా వాటి వల్ల ఎదురయ్యే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఆత్మహత్యలనేవి సమస్యకు ఏ మాత్రం పరిష్కారం కావు. సమస్యలు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా విచక్షణతో ఆలోచిస్తే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ

సంబురంగా తీజ్


తీజ్ సంబురాల్లో యువతులు

జన్నారం: లంబాడి గిరిజనుల పండుగ తీజ్‌ను మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి లంబాడాలు పొనకల్ జువ్విగూడలోని సేవలాల్ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి మండల కేంద్రంలోని అంగడీ బజార్‌లోని సేవలాల్ చౌక్ వద్దకు చేరుకున్నారు. వారం రోజులుగా మట్టిలో వేసిన గోధుమలు, వరిగింజలు మొకలెత్తగా వాటిని నెత్తిన పెట్టుకుని మహిళలు సంప్రదాయ నృత్యాలు చేశారు. పురుషులు ఒకే రంగులోని పట్కా ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంగడీబజార్ నుంచి పోలీస్‌స్టేషన్ సమీపంలోని వాగు వరకూ నృత్యాలు చేస్తూ ర్యాలీ తీశారు. అనంతరం వాగులో తీజ్ బుట్టలను నిమజ్జనం చేశారు.

ప్రముఖుల హాజరు..

జన్నారం మండలంలోని తీజ్ ఉత్సవాలకు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు హాజరయ్యారు. బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ హాజరై పురుషులతో కలిసి నృత్యం చేశారు. అలాగే బీజేపీ రాష్ట్ర ఫ్లోర్ లీడర్ జానుబాయి, బీఎస్పీ అభ్యర్థి బన్సిలాల్, కాంగ్రెస్ నాయకులు కిషన్ నాయక్‌లు హాజరై పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బంజార సేవా సమితి, ఉత్సవ సమితి నాయకులు సందేశ్, ప్రకాశ్‌నాయక్, దశరథ్, ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్‌లు రమేశ్, రాజన్న, వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజరాంరెడ్డి, నాయకులు ఫజల్‌ఖాన్, జనార్దన్ ఉన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్ కాలనీ, చందారం గ్రామంలో లంబాడాలు తీజ్ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు.

సరిహద్దుల్లో పటిష్ట నిఘా

బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర , జిల్లాల సరిహద్దుల్లో చేపట్టే పకడ్బందీ చర్యలపై శనివారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాలూర రోడ్డులోని ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాలులో మహారాష్ట్ర పోలీసులతో పాటు, రాష్ట్రంలోని ఆరు జిల్లాల ఎస్పీలు సమావేశం నిర్వహించారు. ఇందులో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా పెట్టాలన్నారు. మద్యం, నగదు, మాదక ద్రవ్యాల సరఫరాపై నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, నాందేడ్ జిల్లా సరహద్దుల్లోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చెక్ పోస్టులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేసుకొని నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్ విషయంలో ఇరు జిల్లాల, రాష్ట్రాల అధికారులు సహకరించుకుంటూ ముందుకు వెళ్లాల న్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులైన సాలూర, కండ్గావ్, కందకుర్తి, పోతంగల్ వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటితో పాటు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు డోడ్గాన్ (సోన్) బ్రహ్మంగారి గుట్ట, సిరికొండ, ఇందల్వాయి టోల్‌ప్లాజా, మల్లారం గండి, యంచ (బాసర)ల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సరిహద్దులో హైవే పెట్రోలింగ్, మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీస్ అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఇరు రాష్ట్రాల పోలీసులు పరస్పర సహాయ సహకారాలు అందించుకుంటూ ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్, నిర్మల్ జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జగిత్యాల జిల్లా ఎస్పీ భాస్కర్, కామారెడ్డి జిల్లా ఎస్పీ బి శ్రీనివాస్, నాందేడ్ జిల్లా (బోకర్) అదనపు ఎస్పీ కేపీ ధరణి, నిజామాబాద్ జిల్లా అదనపు డిప్యూటీ కమిషనర్ జయరామ్, నిజామాబాద్ జిల్లా కమర్షియల్ ట్యాక్స్ అధికారి లావణ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ


పాల్గొన్న వివిధ జిల్లాల ఎస్పీలు, అధికారులు

ఎవరిని అవమానపరిచే ఉద్దేశం లేదు

- ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ


మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ

భైంసాటౌన్: భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబును కించపరిచే ఉద్దేశం తనకు లేదని ఏఎంసీ మాజీ చైర్మన్ పి.కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి టికెట్ ఖరారు అయిన సందర్భంలో ఆయన అభిమానిగా తన పేరిట అప్పుడే ఫ్లెక్సీ ఏర్పాటు చేశానని, అది కూడా తన అనుచరులు ఏర్పాటు చేశారని స్పష్టం చేశారు. అయితే దీన్ని రాజేశ్‌బాబు తనకు వ్యతిరేకంగా, అవమానపరచాలనే ఉద్దేశంతోనే ఏర్పాటు చేశానని ఆపాదించుకోవడం బాధాకరమన్నారు. గతంలో ఆయనకు చైర్మన్ పదవి కేటాయింపు విషయంలోనూ జాప్యంలో తన పాత్ర ఉందంటూ పార్టీకి చెందిన పలువురి వద్ద తన ప్రస్తావన తెచ్చారని గుర్తు చేశారు. ఇటీవల మంత్రి తలసాని దాడి ఘటన వీడియో ప్రచారంలోనూ తనపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పార్టీలోని అసమ్మతి వర్గం ఆయన్ను తప్పుదోవ పట్టిస్తున్నారని, తనకు రాజేశ్‌బాబుతో ఎలాంటి విబేధాలు లేవన్నారు. సమావేశంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ జేకే పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు తోట రాము, ఆసిఫ్, ఫారూక్, తదితరులు ఉన్నారు.

సొంత పార్టీ వారే అవమానిస్తున్నారు

- ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు

భైంసాటౌన్: ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నామనే కారణంతోనే తనను సొంత పార్టీ వారే అవమానిస్తున్నారని భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. భైంసా ఏఎంసీ కాటన్‌మార్కెట్ ప్రవేశద్వారం వద్ద వెలిసిన ఫ్లెక్సీపై ఆయన స్పందించి శనివారం ఏఎంసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల మంత్రి తలసాని తనపై చేసిన దాడి వీడియోను స్థానిక బీఆర్‌ఎస్ శ్రేణులే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసి అవమానపరిచారని, ఇప్పుడు మరింత రెచ్చగొట్టేలా ఏఎంసీ ఎదుటే తనను ఉద్దేశించేలా వ్యాఖ్యలు చేస్తూ దురుద్దేశపూర్వకంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని ఉద్యమంలో పాల్గొన్నానని, అందుకే తనకు ఏఎంసీ చైర్మన్ పదవి వరించిందన్నారు. కొందరి మాదిరిగా పదవి కోసం ఊడిగం చేయలేదన్నారు. ఇకనైనా ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలన్నారు. నియోజకవర్గంలో పథకాల అమలులో అవినీతికి పాల్పడుతున్నారని, దీంతో పార్టీకి చెడ్డ పేరు వస్తోందన్నారు. తనను ఎంత అవమానించినా పార్టీలోనే ఉండి కొట్లాడతానని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు జీవీ రమణారావు, సాప్లి రమేశ్ ఉన్నారు.

పొన్కల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

మామడ: మండలంలోని పొన్కల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వినతిపత్రం అందించారు. కాగా, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పొన్కల్ మండల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హరీశ్ సానుకూలంగా స్పందించారని ఐకేరెడ్డి తెలిపారు. మంత్రి వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మామడ పీఏసీఎస్ చైర్మన్ హరీశ్‌కుమార్, వైస్‌చైర్మన్ భాస్కర్‌రావు ఉన్నారు.


హరీశ్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న మంత్రి, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


లింగన్న మృతదేహం

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై వైజాపూర్ యూ టర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన నైతం లింగన్న (48) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగన్న మోటార్ సైకిల్‌పై కొడుకును చించుఘాట్‌లో ఉండే అత్తగారి ఇంట్లో వదిలి రాత్రి గోపాల్‌పూర్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. సీతాగొంది నుంచి వైజాపూర్ యూటర్న్ సమీపంలో రాత్రి ఎదురుగా వస్తున్న మాక్స్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో రిమ్స్ తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తాండూర్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శనివా రం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ వివరాల ప్రకారం... మండలంలోని రేచిని గ్రామ పంచాయతీ గజ్జలపల్లి గ్రామానికి చెందిన మొగిళి సాగర్ (31) ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇంట్లోనే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. కొంతకాలం మానసిక ఒత్తిడితో ఒంటరిగా ఉంటున్నాడు. సాగర్ తల్లి బానమ్మ బెల్లంపల్లిలోని సింగరేణిలో విధులు నిర్వహిస్తోంది. తల్లి విధులకు వెళ్లగా సాగర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వానలో తడిచి.. శిబిరంలో నిద్రించి..


భారీ వర్షంలోనూ శిబిరంలో దీక్ష కొనసాగిస్తున్న ఉద్యోగులు

- దీక్ష కొనసాగిస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు

నిర్మల్ రూరల్: డిమాండ్లు నెరవేర్చాలని జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన దీక్ష 13వ రోజుకు చేరింది. రోజుకో రీతిలో నిరసన తెలిపిన ఉద్యోగులు శనివారం భారీ వర్షంలోనూ దీక్ష కొనసాగించారు. అలాగే రాత్రి శిబిరంలోనే బస చేసి నిరసన తెలిపారు. గజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం నాయకులు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దిగివచ్చి ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు తీర్చాలని డిమాండ్ చేశారు.


శిబిరంలోనే నిద్రిస్తున్న మహిళా ఉద్యోగులు

గొర్రెల యూనిట్ల పరిశీలన


గొర్రెలను పరిశీలిస్తున్న గంగాధరయ్య

సోన్: మండలంలో రెండో విడత పంపిణీ చేసిన గొర్రెలను జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ గంగాధరయ్య శనివారం పరిశీలించారు. న్యూబొప్పారం గ్రామంలో 12 మంది లబ్ధిదారులకు వచ్చిన గొర్రెల యూనిట్లను పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. సహాయ సంచాలకుడు డాక్టర్ సురేశ్, సర్పంచ్ హరిత, మండల పశువైద్యాధికారి మహేశ్, గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు బండి మహేందర్ తదితరులున్నారు.